

వడదెబ్బపై అవగాహన కల్పించాలి: డీఎంహెచ్‌వో

గజపతినగరం, ఏప్రిల్ 2: వేసవిని దృష్టిలో పెట్టుకొని ఏ ఒక్కరూ వడదెబ్బకు గురి కాకుండా వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంఅండ్‌హెచ్‌వో భాస్కరరావు సూచించారు. మండలంలోని మరుపల్లి పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల్లో ఓఆర్‌టీ కేంద్రాలను, కార్నర్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలు మొబైల్‌లో లాగిన్ అయ్యేలా బాధ్యతగా మెలగాలని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల సూచీలో వెనుకబడిన సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడాలన్నారు.

తాగునీటికి కటకట

- జిల్లాలో మొదలైన కష్టాలు
- గ్రామాల్లో అసంపూర్తిగా కొళాయిలు
- చెలమల నీటిపై ఆధార పడుతున్న గిరిజనులు



వాగు నీటిని పడుతున్న గిరిజన మహిళలు



గొల్లపల్లిలో కొళాయి దగ్గర పరిస్థితి

వేసవి వచ్చిందంటే జిల్లా ప్రజలకు హడలే. చాలా గ్రామాల్లో దాహం కేకలు వినిపించడం సర్వసాధారణమైపోయింది. గిరిజన ప్రాంతాల్లో చెలమల నీరే ఆధారమవుతోంది. విజయనగరంలో రిక్షాలు, ఆటోల్లో నీరు తీసుకువెళ్లి రెండు లేదా మూడు రోజులు నిల్వ చేసుకుంటారు. ఈ ఏడాదీ అదే పరిస్థితి కనిపిస్తోంది. కొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చేతిబోర్ల నుంచి నీరు రావడం లేదు. మరోవైపు జల్‌శక్తి పథకం కింద కేంద్రం కొళాయి కనెక్షన్లు ఇచ్చినా ఎక్కడా పనులు పూర్తి కాలేదు. అవి దిష్టిబొమ్మల్లా మిగిలాయి.

నీటి కోసం నిరీక్షణే..

వంగర, ఏప్రిల్ 2: అరసాడ, సీతారాంపురం, పటువర్ధనం, లక్ష్మింపేట తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చింది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్ల నుంచి నీటి సరఫరా పూర్తిగా తగ్గిపోయింది. కొళాయి నీటి కోసం గంటలకొద్దీ నిరీక్షిస్తుంటారు. అయినా కొద్దినీరే రావడంతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని 39 గ్రామాల్లో 480 వరకు హేండ్‌బోర్లు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నా ఆ గ్రామాల్లో మాత్రం బోర్లు పనిచేయడం లేదు. కొట్టిశ, లక్ష్మింపేట, రాజులగుమ్మడ గ్రామస్థులు పొలాల్లోని నేలబావులు, వేగావతి, నాగావళి నదుల్లోని చెలమల నీటిని తెచ్చుకుంటున్నారు.



అరసాడలో తాగునీటి కోసం నిరీక్షిస్తున్న స్థానికులు (ఫైల్)

బొబ్బిలిలో మూడురోజులకోసారి సరఫరా..

బొబ్బిలి, ఏప్రిల్ 2: బొబ్బిలి పట్టణంతో పాటు మండలంలోని అనేక గ్రామాల్లో తాగునీటికి ఎద్దడి మొదలైపోయింది. బొబ్బిలిలో రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తామని ఏకంగా మున్సిపాలిటీ అధికారికంగా ప్రకటించేసింది. ఇందిరమ్మకాలనీ, గొలపల్లి, మల్లమ్మపేట, చర్చిసెంటరు రోడ్డు తదితర ప్రాంతాల్లో తాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నారు. ట్యాంకర్లు వచ్చినా అందరికీ నీరు అందడం లేదు. పట్టణంలోని పల్లపు ప్రాంతాల వారి ఇక్కట్లు అంతే లేదు. కొళాయి నీరు వారికి సరిగా రావడం లేదు. దీంతో లోతుగా గోతులు తవ్వుకుని వచ్చే అరకొర నీటిని తోడుకుంటున్నారు.

● బొబ్బిలి మండలం శివడగ్రామానికి మన్యం జిల్లా బలిజిపేట మండలం అంపావల్లి స్కీము నుంచి 20 ఏళ్లుగా తాగునీరు అందుతోంది. అయితే నది ఎండిపోవడంతో తాగునీరు సరఫరా కావడం లేదు. ప్రత్యామ్నాయంగా స్థానిక బోరునుంచి తాగునీటిని పంపింగ్ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. అంతలో కోడ్ ఉందని, పనులు ఆపేయాలని అధికారులు చెప్పడంతో గ్రామస్థులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను కలిసి అర్థించినా పట్టించుకోవడం లేదని గ్రామసర్పంచ్ అధికారులను అర్థించాను : వెంగల లక్ష్మీరాణినారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు.

● బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామంలో రూ. 30 లక్షలతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. పనులు పూర్తికాకపోవడంతో అవి నిరుపయోగంగా మిగిలాయి. రెండు, మూడురోజులకోసారి పబ్లిక్ కుళాయిల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు.





కోమటిపల్లిలో నీరు రాని ఇంటింటి కొళాయిలు



శివడవలస గ్రామంలోని తాగునీటి ట్యాంకు

● అలజంగి గ్రామంలో విద్యుత్ లైనుపనుల కారణంగా తాగునీటి పైపులైను పాడైంది. గ్రామంలో సుమారు పది రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

● భోజరాజపురం వద్ద వేగావతి నదిలో ఉన్న ఊట బావుల నుంచి బొబ్బిలి పట్టణానికి తాగునీరు సరఫరా అవుతోంది. ఇసుక దొంగల కారణంగా ప్రస్తుతం నదిలోని ఊటబావుల వద్ద నీటి నిల్వలు ఉండడం లేదు. పెద్దగెడ్డ నుంచి వేగావతిలోకి నీటిని విడిచిపెడుతున్నా బావులకు నీరందడం లేదు. దీంతో అనేక వార్డులకు ట్యాంకర్లు, హ్యాండ్‌బోర్లే దిక్కవుతున్నాయి.

చెలమలే ఆధారం..

మెంటాడ, ఏప్రిల్ 2: కొండ లింగాలవలస, శీలవలస లోతుగెడ్డ పంచాయతీల పరిధిలోని వేప గుడ్డి, పోరపుబాడవలో గిరిజనులు తాగునీటికి నోచడం లేదు. శీలవలస గ్రామాన్ని ఆనుకొని వెళ్లే వాగునీరే వారికి దిక్కు. అన్నికాలాల్లోనూ వారికి దాహం కేకలే. వానాకాలంలో వాగునీటిని వడగట్టి తాగుతారు. వేసవిలో ఎండిన వాగు గర్భంలో చెలమల నీళ్లను పట్టుకుంటారు. రక్షిత నీటికి నోచుకోవడం లేదు. దీంతో తరచూ అతిసారం,డయేరియాతో చాలా మంది బాధపడుతున్నారు. చేతిపంపు అయినా ఏర్పాటు చేయాలని వారిచ్చే వినతులను ఏ నేతా పరిగణనలోకి తీసుకోవడం లేదు. లోతుగెడ్డ పంచాయతీ మధుర పోరవుబాడవ, వేప గుడ్డు గ్రామాలు ఆంధ్ర జలాశయం ఆవల వున్నాయి. వారందరికీ ఒక్క చేతిపంపే ఆధారం. అది నిత్యం మొరాయిస్తూనే వుంటుందని గిరిజనులు చెబుతున్నారు. ఆ సమయాల్లో చంపావతి నదిలోని ఊట నీరే వారికి శరణ్యం.



శివడవలసలో ఆగిపోయిన పైప్‌లైన్ పనులు

మిమ్స్ ఉద్యోగుల గర్జన

- ఎల్‌బీజీ భవనం నుంచి కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ
- పోలీసులు, ఉద్యోగుల మధ్య తోపులాట
- అరెస్టు చేసి స్టేషన్‌కు తరలింపు



మిమ్స్ ఉద్యోగుల రాస్తారోకో..

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 2: మిమ్స్ ఉద్యోగులు 62 రోజులుగా చేస్తున్న పోరాటాన్ని ఉధృతం చేశారు. ఎన్ని రోజులు ఆందోళన చేసినా తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. తోటపాలెంలోని ఎల్‌బీజీ భవనం నుంచి మయూరి కూడలి వరకూ మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టి నినాదాలు చేశారు. వారి ఆందోళనను భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, ఉద్యోగుల మధ్య తోపులాట జరిగింది. ఒక మహిళా ఉద్యోగి సొమ్మసిల్లి పడిపోయింది. అనంతరం ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. యూనియన్ అధ్యక్షుడు టీవీ రమణ, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌లు విలేకరులతో మాట్లాడుతూ, మిమ్స్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు సంస్థ అన్యాయం చేసిందన్నారు. కాంట్రాక్టు ఉద్యో గులను రెగ్యులర్ చేయాలని, వేతన ఒప్పందం చేయాలని, సస్పెండ్ చర్యలతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పోరాడుతుంటే యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తున్నదన్నారు. అక్రమ అరెస్టులు, కేసులతో ఉద్యమాన్ని ఆపలేరని, సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. సీఐటీయు ప్రతినిధులు సుధారాణి, ఉద్యోగులు కామనాయుడు, రాంబాబు, మధు, బంగారునాయుడు, స్వర్ణ, భవాని పాల్గొన్నారు.



భగ్నం చేస్తున్న పోలీసులు

పౌరుడి చేతిలో బ్రహ్మాస్త్రం సి-విజిల్

- నియమావళి ఉల్లంఘనపై ఫోన్ నుంచే ఫిర్యాదుకు అవకాశం
- 100 నిమిషాల్లో అధికారుల చర్యలు
- ఇప్పటి వరకూ జిల్లాలో 109 ఫిర్యాదులు

కలెక్టరేట్, ఏప్రిల్ 2: పౌరునికి బ్రహ్మాస్త్రంగా సి-విజిల్ యాప్ దోహదపడుతోంది. ఎన్నికల నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా క్షణాల్లో పౌరులు తమ ఫోన్ నుంచే ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవడంతో ఈ యాప్ ప్రజల్లోకి బాగా వెళ్లింది. జిల్లాలో ఇప్పటివరకు సివిజిల్‌కు 109 ఫిర్యాదులు అందాయి. ఆధునిక సాంకేతిక విధానం అమలు చేయడంలో ఎన్నికలు సంఘం ముందడుగు వేసింది. పౌరుని చేతిలో బ్రహ్మాస్త్రంగా సి.విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఫిర్యాదు సరైనది అయితే 100 నిమిషాల్లో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సి.విజిల్ ఆధారంగా జిల్లా కేంద్రంలో పనిచేయడానికి ప్రత్యేక సెల్ ఉంది. ఇందులో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఎవరైనా ఈ యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎక్కడైనా సమస్య ఉంటే లైవ్ ఫొటోలు, వీడియోలను ఈ యాప్ ద్వారా పంపవచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ఫ్లయింగ్ స్క్వాడ్ లేదా అధికారులకు సమాచారం వెళ్తుంది. ఆ ప్రకారం ఆయా ప్రాంతాల్లో ఉన్న తనిఖీ బృందాలకు (ఎస్ఎస్‌టి)కు కూడా ఫిర్యాదు వచ్చిన ఐదు నిమిషాల్లో సమాచారం వెళ్తుంది. వెంటనే వారు విచారించి చర్యలు తీసుకుంటారు. ఇలా ఇప్పటి వరకూ జిల్లాలో సి-విజిల్‌కు 109 ఫిర్యాదులు వచ్చాయి. ఎక్కువగా విజయనగరం నియోజకవర్గం నుంచి అందాయి. ఫిర్యాదు వచ్చిన 100 నిమిషాల్లో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

cVIGIL



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మానటరింగ్ సెల్

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

- సచివాలయాల్లో ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు అందజేత
- ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అధికారుల చర్యలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 2: ఎన్నికల కమిషన్ ఆదేశంతో పింఛన్ల పంపిణీకి అధికారులే శ్రీకారం చుడుతున్నారు. వలంటీర్లు లేకపోయినా ఇబ్బంది లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం నుంచి పంపిణీ మొదలుపెట్టాలని భావించారు. బ్యాంకుల నుంచి నగదు తెచ్చేందుకు సమయం పట్టనుండడంతో గురువారం నుంచి పూర్తి స్థాయిలో అందజేస్తారు. అదే సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎలా పంపిణీ చెయ్యాలన్నదానిపై అధికారులు కసరత్తు చేశారు. ఒక్కోవార్డు చొప్పున వరుస సంఖ్యలో పింఛను ఇచ్చేలా వారికి ముందే సమయం చెబుతారు. ఆయా వార్డులు, వీధుల్లోని లబ్ధిదారులకు పింఛన్ అందిన తరువాత మిగతా వారిని పిలుస్తారు. ఇలా ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుంది. అనారోగ్యంతో నడవలేని వారు, దివ్యాంగులు, వృద్ధులకు సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి పింఛన్‌లు అందిస్తారని డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి తెలిపారు. జిల్లాలో 2 లక్షల 82 వేల 748 మంది ప్రతినెల పింఛను అందుకుంటున్నారు. వీరిలో వృద్ధులు 1,47, 874 మందికాగా దివ్యాంగులు 37, 840 మంది, ఇతరులు 97వేల మంది ఉన్నారు.

రేపటి నుంచి పంపిణీ: కలెక్టర్

కలెక్టరేట్: ఈనెల 4వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఆమె మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సచివాలయాల వద్ద ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకూ పింఛను అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో ఈనెల 3వ తేదీన పింఛను నిధులు జమవుతాయని, వాటిని 4వ తేదీ నుంచి అందజేయాలన్నారు. దివ్యాంగులు, వివిధ రకాల తీవ్ర వ్యాధులతో బాధపడుతున్న వారు, మూడు చక్రాలు సైకిల్ సహాయంతో వెళ్లాల్సి ఉన్న వారు మినహా మిగిలిన వారంతా ఆయా గ్రామ, వార్డు సచివాయాలయాల వద్ద ఏర్పాటు చేసే కౌంటర్ల నుంచి పింఛను తీసుకోవాలన్నారు. తాగునీరు, షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే పంపిణీ చేయాలని, 6వ తేదీ నాటికి పూర్తి కావాలని ఆదేశించారు.

దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

- అందుబాటులోకి సాక్ష్యం యాప్
- బ్రెయిలీలో నమూనా బ్యాలెట్ పేపర్
- కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, ఏప్రిల్ 2: ఎన్నికల్లో పాల్గొనే విభిన్న ప్రతిభావంతులకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తోందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాలోని దివ్యాంగులంతా శతశాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. తన చాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన డీఎంసీఏఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలనూ గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివ్యాంగులు క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేదని, నేరుగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లవచ్చునని తెలిపారు. వారి కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సాక్ష్యం యాప్ తీసుకొచ్చిందని, దీనిని ప్రతీ ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఓటరు జాబితాలో దివ్యాంగులుగా నమోదై ఉండి, సదరం ధ్రువ పత్రం ప్రకారం తమకు 40 శాతం పైబడి వైకల్యం ఉంటే వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం ఉందన్నారు. సాక్ష్యం యాప్ ద్వారా హోమ్ ఓటింగ్ కోసం ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో పేరు తెలుసుకోవాలన్నా... తమ పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవాలన్నా.. వీల్ చైర్, వలంటీరు సౌకర్యం కావాల్సి వచ్చినా ఈ యాప్‌లో దరఖాస్తు చేసుకో వచ్చునని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 580 వీల్ చైర్లను ఎన్నికల రోజు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అంధులకు బ్రెయిలీ లిపిలోనూ ఓటరు స్లిప్పులను పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సుమారు 10,550 మంది అంధులు ఓటర్ల జాబితాలో నమోదై ఉన్నారని చెప్పారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పేపర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జేసీ కార్తీక్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ జగదీష్, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌రావు, సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, విద్యాశాఖ ఏడీ గౌరీ శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కాంగ్రెస్ అభ్యర్థులు వీరే

- ఎట్టకేలకు నాలుగు నియోజకవర్గాల్లో ప్రకటన
- బొబ్బిలి, ఎస్.కోట, నెల్లిమర్ల పేర్లు త్వరలో వెల్లడి

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ తరఫున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఆ పార్టీ తాజాగా ప్రకటించింది. జాబితాను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా... నాలుగు చోట్ల పోటీ చేసే వారి పేర్లనే వెల్లడించారు. ఇంకా ఎస్.కోట, నెల్లిమర్ల, బొబ్బిలి నుంచి ఎవరు బరిలో నిలువనున్నారో ప్రకటించలేదు. ప్రధాన పార్టీలు టిక్కెట్లను ఇప్పటికే ప్రకటించడంతో కాంగ్రెస్ నాయకుల్లో కాస్త టెన్షన్ కొనసాగింది. మిగతా వారి పేర్లను త్వరలోనే తేల్చేసే అవకాశం ఉంది. ఆయా చోట్ల ఆశావహుల్లో ఇంకా ఉత్కంఠ వీడలేదు.

పోటీ చేసే స్థానం	అభ్యర్థి పేరు
విజయగనరం	సుంకరి సతీష్‌కుమార్
చీపురుపల్లి	తుమ్మగంటి సూరినాయుడు
గజపతినగరం	గందపు కూర్మినాయుడు
రాజాం	కంబాల రాజవర్ధన్

విజయనగరం ఎంపీ : సరగడ రమేష్‌కుమార్

రాజీనామా చేయండి

- వైసీపీ నాయకుల ఒత్తిడి
- మెసేజ్‌లతో చావగొడుతున్నారని వలంటీర్ల గగ్గోలు



బొబ్బిలి/ రామభద్రపురం, ఏప్రిల్ 2: వలంటీర్లంతా రాజీనామాలు చేసెయ్యాలని వైసీపీ నాయకులు వారిపై ఒత్తిడి చేస్తున్నారు. అస్తమానం వారి ఫోన్లకు మెసేజ్‌లు పెడుతున్నారు. అప్పటికీ వినకుంటే వారి కుటుంబ సభ్యులు, బంధువులతో చెప్పిస్తున్నారు. దీంతో ఏమి చేయాలో తోచక, ఎవరితో చెప్పుకోవాలో తెలియక వలంటీర్లు ఒత్తిడికి గురవుతున్నారు. స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని వారి మెడపై కత్తి పెట్టినట్లు నాయకులు వ్యవహరిస్తున్నారు. ఫీల్డు ఆపరేషన్ ఏజెన్సీ పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపుల్లో ఈ ఒత్తిడి విపరీతంగా ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీ చెప్పినట్లు చేయాలా? లేక మిన్నకుండి పోవాలా? అని మథనపడుతున్నారు. ఎన్నికల్లో వారిని అన్ని విధాలా ఉపయోగించుకోవాలని నాయకులు వ్యూహం పన్నారు. వలంటీర్లకు ఉన్న పరిచయాలతో ఓట్లు దండుకునే ప్రణాళిక రచించారు. ఇప్పటికే దుస్తులు, డబ్బులు తదితర తాయిలాలు అందజేశారు. వీటిని తీసుకోవడం కొందరు వలంటీర్లకు ఇష్టం లేకపోయినప్పటికీ రాజకీయ పరమైన వైరం వస్తుందేమోనని భయపడి తీసుకున్నారు. రాజీనామాలను వారు ఏమాత్రం ఇష్టపడడం లేదు. దీనిపై వారు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.

అదే సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు వలంటీర్ల వ్యవస్థపై ఇచ్చిన భరోసా నమ్మశక్యంగానే ఉందని, వారు అధికారంలోని వస్తే తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. ప్రజావాణి చూస్తే ప్రభుత్వం పట్ల సానుకూలత లేదని, భవిష్యత్‌లో మేలు జరుగుతుందని అనుకోలేమని బొబ్బిలికి చెందిన ఓ వలంటీరు చెప్పాడు. కరడుగట్టిన కార్యకర్తల్లాంటి వలంటీర్లు మినహా మిగిలిన వారంతా వలంటీరు పోస్టులను వదులుకునేందుకు ససేమిరా అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజీనామా చేసిన వలంటీర్లకు భవిష్యత్ ఉండకపోవచ్చుననేది వారి భావన. తామంతా పేదలమని, కేవలం ఐదువేల రూపాయలకు పనిచేస్తున్నామని, రాజకీయాల్లోకి లాగి ఇబ్బందులకు గురిచేయవద్దు అంటూ చాలా మంది వలంటీర్లు విన్నవించుకుంటున్నారు.

● రాజీనామా చేసినవారు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేయాలని రామభద్రపురం మండలంలో కొందరు వలంటీర్లకు మెసేజ్‌లు వచ్చాయి. రాజీనామాకు ముందుకు రాని వారి పట్ల పరుషంగా మాట్లాడుతున్నారని సమాచారం. తామే పోస్టులు వేశాం, చెప్పినట్టు రాజీనామా చేయాలంటున్నారు. వలంటీర్లు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

నోటి సంబంధిత వ్యాధులపై అవగాహన

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని విజయ్యంపేట పీహెచ్‌సీ వైద్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నోటి సంబంధిత వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వియ్యంపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.జయశ్రీ తమ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. నోరు శుభ్రంగా ఉంటే శరీరం శుభ్రంగా ఉంటుందని వైద్యులు తెలిపారు. నోటి ద్వారా క్యాన్సర్, పంటి, గొంతు సం బంధిత వ్యాధులు వస్తాయన్నారు. హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

లక్కవరపుకోట (కొత్తవలస): కొత్తవలసలోని విజ్ఞాన భారతి పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చొక్కాకుల జగదీశ్వరి, అప్పారావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విన్నకోట గణేష, ఎస్.త్రినాథ్, కరాటే త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

విజయనగరం (ఆంధ్రజ్యోతి): నగరంలోని అరికగడ్డ వీధిలో గల టాట్ ఐటీఐ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. తెలంగాణలోని వివిధ సంస్థల్లో పని చేసేందుకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. డిప్లమో, ఐటీఐ, డిగ్రీ, ఇంటర్ పాసైన వారు ఈ జాబ్‌మేళాను వినియోగించుకోవాలని కోరారు. అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 95534 20598, 94946 01172 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

రాజాం రూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు ప్రారంభిం చామని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సమ్మర్ క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని కంచరాం, ఆగూరులో పాడైన బోర్లకు మంగళవారం మరమ్మతు చేయిం చారు. బోర్లు పాడైతే మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని శ్రీనివాసరావు సూచించారు.

బాలల పుస్తక దినోత్సవం

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం నిర్వహించినట్టు గ్రంథాలయ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం ఓ మంచి స్నేహితుడిలాంటిదని.. అలసిన మనసులను సేద తీరుస్తుందని తెలిపారు. అనంతరం పిల్లలతో వివిధ కథల పుస్తకాలు చదివించారు.

ఆటిజమ్‌పై అవగాహన అవసరం

విజయనగరం రింగురోడ్డు: ఆటిజంపై అవగాహన అవసరమని ఎ కిడ్స్ కేర్ సెంటర్ ఎమ్‌డీ ఎన్.పవన్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆటిజమ్ అవగాహన దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రైవేటు స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత గణాంకాల ప్రకారం ప్రతి పది మంది శిశువుల్లో ఆరుగురు ఆటిజమ్ సమస్యలు కలిగి ఉన్నారని తెలిపారు. ఆటిజానికి చికిత్స లేదని.. కానీ వారికి అవసరమైన థెరపీల ద్వారా మార్పు వచ్చే అవకాశం ఉందన్నారు. మూడేళ్ల దాటినా మాట రాకపోవడం, రంగులను గుర్తించలేకపోవడం, వారిలో వారు మాట్లాడుకుంటూ ఉండడం.. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడడం.. తమను తాము గాయపరుచుకోవడం వంటివి ఆటిజం లక్షణాలని తెలిపారు.

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం టీవీ లక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావుల ఆధ్వర్యంలో ఆటిజంపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రపంచ ఆటిజం దినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, శంకరరావు, నారెమ్మ, విజయమ్మ, కల్యాణి, రామకృష్ణ, పీడీ బంగారునాయుడు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి

విజయనగరం దాసన్నపేట: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, ఉపాధి రంగాల సంక్షోభంపై విద్యార్థులు, యువకులు పోరాడాలని ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు, పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో భగత్ సింగ్ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం అంకిత భావంతో పోరాడారని, నేటికీ ఆ లక్ష్యం నెరవేరలేదన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న దోపిడీ విధానాలపై విద్యార్థులు, యువకులు పోరాడా లని పిలుపునిచ్చారు. సంఘ ప్రతిని ధులు గిరిప్రసాద్, సోమేష్, రాకేష్, దిలీప్, దినేష్ తది తరులు పాల్గొన్నారు.

తప్పుడు మస్తర్లను సహించేది లేదు

రేగిడి: తప్పుడు మస్తర్లను సహించేదిలేదని ఉపాధి ఏపీవో హరినాథ్ వేతనదారులు, మేట్లకు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపురంలో వప్పలవాని చెరువుకు జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. టీఏ ఆనందరావు, ఎఫ్ఏ స్వామి బాబు ఉన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో గల 6,243 మంది లబ్ధిదారులకు సచివాలయ కార్యదర్శుల ద్వారా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. 4, 5, 6 తేదీలలో రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు పంపిణీ చేస్తారన్నారు. నడవలేని దివ్యాంగులకు, మంచం మీద నుంచి కదలలేని వారికి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తామన్నారు.

7న అవగాహన శిబిరం

జామి: విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 7న జంతు హింస, రవాణా చట్టాలపై అవగాహన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కూటమి పేరుతో మరోసారి మోసం: వైవీ

బొబ్బిలి, ఏప్రిల్ 2: గతంలో బీజేపీతో కలిసి వచ్చి చంద్రబాబు ఓట్లు దండుకున్నాడని, మళ్లీ ఇప్పుడు మరోసారి ప్రజానీకాన్ని మోసగించేందుకు ముందుకొస్తున్నారని ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి అన్నారు. బొబ్బిలి పట్టణంలో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గల 66 లక్షల పెన్షన్ లబ్దిదారుల కుటుంబాలన్నీ వైసీపీకి మాత్రమే ఓటు వేస్తారన్న భయం చంద్రబాబుకు పట్టుకుందన్నారు. అందుకే వాలంటీర్లను లబ్ధిదారులకు దూరం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ ఎమ్మెల్యే శంబంగి, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

రామభద్రపురం: మండల కేంద్రంలో ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ ధరించాలని సూచించారు.

పట్టణమంతా అధ్వానమే..

- బొబ్బిలిలో ఎక్కడికక్కడే చెత్త నిల్వలు
- పట్టించుకోని యంత్రాంగం

బొబ్బిలి, ఏప్రిల్ 2: బొబ్బిలి పట్టణంలో పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. పట్టణ జనాభా, ఆవాస ప్రాంతాలకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య లేకపోవడంతో ఈ సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. అపార్టుమెంట్లు, కొత్తకాలనీలు, కాలువలు, రోడ్లు పెరుగుతుండడంతో వాటి నిర్వహణను చాలీచాలని సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఫలితంగా గొల్లవీధి జంక్షన్, కొత్త ఎరుకలివీధి, దావాల వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా తదితర ప్రాంతాల్లో మురుగుకాలువలు చెత్తా చెదారాలతో నిండిపోయి విపరీతమైన దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. నాయుడుకాలనీలో పందులు, పశువులు, కుక్కలు స్థిరనివాసం ఏర్పరుచుకున్నాయి. వాటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు నివాసం ఉండే పాకీ వీధిలో డ్రైనేజీలు చాలా అధ్వానంగా ఉన్నాయి. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో చాలా ఇబ్బందికరంగా తయారయ్యాయి. మురుగుకాలువల కారణంగా దోమలు, ఈగల బెడద చాలా ఎక్కువగా ఉందని ఆయా ప్రాంతాల వారు గగ్గోలు పెడుతున్నారు. ● ఇంటింటి చెత్త సేకరణ విధాన ం అమలులో ఉన్నప్పటికీ అమ్మిగారికోనే రుగట్టు జంక్షన్, తాండ్రపాపారాయ జంక్షన్, గాంధీ బొమ్మ సెంటరు, కళాభారతి సెంటరు, జంగాల శివాలయం జంక్షన్ తదితర ప్రాంతాల్లో సేకరించిన చెత్తా చెదా రాలు పెద్దఎత్తున గుట్టలుగా పేరుకుపోతు న్నాయి. వాటిని పశువులు మరింతగా చెల్లాచెదురు చేస్తుండడంతో చాలా అసౌక ర్యంగా ఉంటోందని, క్లీన్ ఆంధ్రా, క్లీన్ బొబ్బిలి అనే నినాదాలు ఎమయ్యాయని, పట్టణాన్ని ఎప్పటికి పరిశుభ్రంగా ఉంచుతారని పట్టణ ప్రజలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.



నాయుడుకాలనీలో పందులు ఇలా..



అమ్మిగారికోనేరు జంక్షన్‌లో చెత్తకుండీ తీరు

సీపీఆర్‌పై అవగాహన అవసరం

విజయనగరం రింగురోడ్డు: దేశంలో ప్రతి నిమిషానికి 112 కార్డియాక్ అరెస్టులు సంభవిస్తున్నాయని ఇండియన్ రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ వేణుగోపాల రెడ్డి అన్నారు. ఇందులో 80 శాతం బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్నాయని... సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫూల్‌బాగ్‌లోని ఎంఆర్ ఫార్మసీ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్ చేసే సమయాల్లో నైపుణ్యం ఎంతో ముఖ్యమని, శ్వాస, నాడిని చూడాలని, భుజం తట్టి స్పందిస్తున్నారో? లేదో చూడాలన్నారు. సీపీఆర్ చేస్తూనే అంబులెన్స్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీఆర్ విధానంపై ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, కార్యదర్శి కె.సత్యం, ప్రొఫెసర్ పి.ఉదయ్ శంకర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విజయమే లక్ష్యంగా పనిచేయండి



పార్టీలో చేరిన వారితో టీడీపీ నేత అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీల ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నగరంలోని 46వ డివిజన్‌కు చెందిన ఉత్తరావల్లి రాజేష్, బొండపల్లి దండుబాబు, గర్బాపు పద్మాకర్, గర్బాపు ప్రసాద్ యాతవీధికి చెందిన మైనపు శివకుమార్, సిమ్మా సాయి, నగరంలోని 30వ డివిజన్‌కు చెందిన గేదెల శంకరరావు, గెదెల అచ్చయ్య, పతివాడ నర్సింగరావు, అదపాక నర్సింగరావు, గేదెల బంగారు తాతల ఆధ్వర్యంలో వివిధ కుటుంబాలు వైసీపీని వీడి అదితి సమక్షంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. నిత్యావసరాల ధరలు నింగిని అంటాయన్నారు. రాష్ట్రంలో నిరుపేద, పేద, మధ్య తరగతి ప్రజలు జీవించలేని పరిస్థితులు కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, కోండ్రు శ్రీనివాసరావు, కంది సాయి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ పాలనలో మున్ముందు మేలు



ఎన్నికల ప్రచారంలో గొర్రెపిల్లతో బేబీనాయన

బొబ్బిలి: అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో ఎన్‌డీఏ ఆధ్వర్యంలో డబుల్ ఇంజను సర్కారు పరిపాలన రాబోతుందని...ఇకపై అన్ని వర్గాల వారికి మంచి జరుగుతుందని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. మంగళవారం బొబ్బిలి 13వ వార్డులో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. గొల్లవీధి, కొత్తఎరుకలి వీధి తదితర ప్రాంతాలలో వెదురుబుట్టల తయారీ, గొర్రెలు, మేకల పెంపకం వంటి వాటిపై ఆరా తీశారు. ఆ పనిలో బేబీనాయన కూడా ఓ చేయి వేశారు. వైసీపీ ప్రభుత్వ పీడ మరికొద్ది రోజుల్లో విరగడ అవుతుందని అన్నారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ బొట్ట తిరుపతమ్మ, మాజీ కౌన్సిలర్ గొర్లె అంకులు, నాయకులు బొట్ట శివ, ములమండల సురేష్, చప్ప త్రినాథ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, సీనియర్ నేతలు రౌతు రామ్మూర్తి, పువ్వల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు, జనసేన నాయకులు లంక రమేష్, పెద్దింటి మనోజ్ కుమార్, తెలుగు మహిళ నాయకురాళ్లు బర్లి శ్రీదేవి, వెలగాడ షైమావతి తదితరులు పాల్గొన్నారు.

పుర్లిలో చిదంబరేశ్వర ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

రేగిడి: మండలంలోని పుర్లిలో చిదంబరేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం మంగళవారం నుంచి ప్రారంభమ య్యింది. ఆలయ ధర్మకర్త, స్థలదాత పట్ట పార్వతమ్మ, ఆదినారాయణ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు జోష్యుల కూర్మనాధశర్మ నేతృత్వంలో పూజలు నిర్వహించారు.



భక్తుల సామూహిక పూజల దృశ్యం

వార్డుల సమాచారంపై అవగాహన అవసరం

బొబ్బిలి: ప్రతి సచివాలయం కార్యదర్శి తమ వార్డుల పరిధిలో గల అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆమె వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు, మున్సిపల్ ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వీధి దీపాలు, మంచినీటి కుళాయిల నిర్వహణ వంటి సమాచారాన్ని కలిగి ఉండాలన్నారు. వార్డుల్లో ఎన్ని కుళాయిలు ఉన్నాయి? వీధిదీపాలు, బోరువెల్స్, మంచినీటి బావులు ఉన్నాయి, వాటి పనితీరు ఎలా ఉంది? అన్న విషయాలను నివేదిక రూపంలో తయారు చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ తాను నిర్వహిస్తున్న వార్డుల పర్యటనల్లో ఈ సమాచారంతో తప్పక హాజరుకావాలని ఆమె ఆదేశించారు. వార్డు ప్రజలు తెలిపే సమస్యలకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై అంచనాలను తయారు చేసుకోవాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే సహించేది లేదని కమిషనర్ హెచ్చరించారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబకు మంగళవారం చదురుగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పువ్వులతో అమ్మవారిని అలంకరించారు. మంగళవారం పైడిమాంబకు ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఎక్కువ మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ రకాల పండ్లను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.



బీసీలే టీడీపీకి వెన్నెముక

తెర్లాం: బీసీలే టీడీపీ వెన్నుముకని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బేబీనాయన అన్నారు. మండలంలో మంగళవారం కొరటాం గ్రామంలో ఏర్పాటు చేసిన జయహో బీసీ సభలో ఆయనతో పాటు ఉమ్మడి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని, బీసీల నడ్డి విరిచిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా



కళా వెంకటరావును సత్కరిస్తున్న జనసేన నాయకులు

రాజాం: చీపురుపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా అధిష్ఠానం ఎంతో నమ్మకంతో టిక్కెట్ ఖరారు చేసిందని, అక్కడి ప్రజలకు అందు బాటులో ఉండి ఎన్నికల ప్రచార కార్యక్రమాలు చేపడతానని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు తెలిపారు. మంగళవారం రాజాం క్యాంపు కార్యా లయంలో చీపురుపల్లి నియోజకవర్గం జనసేన నాయకులు కళావెంకటరావును సన్మానించారు. ఈ సందర్భంగా కళా వెంకటరావు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో అందరు పనిచేస్తే ప్రత్యర్థిని ఓడించగలమన్నారు. టీడీపీ అసమ్మతి వాదులందర్నీ ఒకతాటిపైకి తీసుకువస్తానన్నారు. అందరూ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తే భవిష్యత్‌లో పదవులు వరిస్తాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయమే



మాట్లాడుతున్న కోండ్రు

రాజాం, ఏప్రిల్ 2: వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహనరావు ఆరోపించారు. సంతకవిటి మండలం బొద్దూరు గ్రామంలో మంగళవారం రాత్రి జయహో బీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంతకవిటి మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడుతో కోండ్రు గ్రామంలో టీడీపీ శ్రేణులు, బీసీలు భారీ ర్యాలీ తీశారు. అనంతరం టీడీపీ ప్రకటించిన సిక్స్‌గ్యారంటీ పథకాలపై కోండ్రు నియోజకవర్గం టీడీపీ క్యాడర్‌తో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కోండ్రు మాట్లాడుతూ బిసిలకు బంగారు భవిష్యత్ ఇచ్చింది టీడీపీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మాధవరాయపురం గ్రామానికి చెందిన వైసీపీ నేతలు గులివిందల రామకృష్ణ, గులివిందల గౌరినాయుడు, చౌదరి సాంబమూర్తి, అవరు సూ రప నాయుడు టీడీపీ తీర్థం స్వీకరించారు. వీరికి కోండ్రు, మాజీ ఎంపీపీ తదితరులు పార్టీ కండువాలు వేశారు.

టీడీపీని గెలిపించుకోవాలి


రాజాం రూరల్: రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్‌ను గెలిపించాలని టీడీపీ నాయకులు గురవాన నారాయణరావు, మాడుగుల, జయరాం, రఘుమండల గణపతి కోరారు. మంగళవారం మండలంలోని దోసరి తదితర గ్రామా ల్లో నాయకులు నాగళ్ల అప్పలనాయుడు, కరణం శివ, టంకాల పాపి నాయుడు, రౌతు వెంకటరమణ, బొత్స లక్ష్ము, బోనెల నారాయణరావు, యాగాటి రాము, ఏగిరెడ్డి శంకర్, మంగం రమేష్ తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు.

విజయనగరంలో 'మహిళా మేలుకో'

విజయనగరం రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరుతూ టీడీపీ అనుబంధ విభాగాలు నగరంలో మంగళవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. 21, 45 డివిజన్ల పరిధిలో టీడీపీ మహిళా విభాగం 'మహిళా మేలుకో' కార్యక్రమాన్ని నిర్వహించింది. మహిళా విభాగం నేతలు పత్తిగిల్లి సూర్యకుమారి, అనురాధ బేగం, కంది శమంతక మణి, సుంకరి సునీత, అవనాపు భార్గవి, మురిపెన పద్మలత తదితరులు పాల్గొన్నారు. టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు 'బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం' కార్యక్రమాన్ని పన్నీరువారి వీధి, కస్పా వీధి, తదితర ప్రాంతాల్లో చేపట్టారు. డాక్టర్ పేరి రామయ్య పంతులు, జంధ్యాల బుచ్చిబాబు, రమణమూర్తి, ధవళ వెంకటరావు, ద్వాదశి వేణు తదితరులు పాల్గొన్నారు. గాజులరేగ క్లస్టర్-7లో 'జయ హో' బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ బీసీ విభాగం నాయకులు కనకల మురళీమోహన్, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు, కోండ్రు శ్రీనివాసరావు, కర్రోతు రాధామణి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాజాం: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.జోషఫ్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ముందుగానే మైక్‌సెట్ వాహనాలు వెళ్లడానికి అనుమతులు తీసుకోవాలన్నారుఎన్నికల ప్రచారం కూడా నిబంధనలు ప్రకారం చేపట్టాలన్నారు. నిబం ధనలు అతిక్రమించి ప్రచారం చేస్తే కేసులు నమోదుచేస్తామని తెలిపారు. నామినేషన్లు వేయడానికి తహసీల్దార్ కార్యాలయానికి మూడువాహనాలతో మాత్రం కార్యాలయం వద్దకు చేరుకోవాలని, అభ్యర్థితో పాటు అదనంగా మరో ముగ్గురు వ్యక్తులు మాత్రమే లోపలికి అనమ తిస్తామని చెప్పారు. నామినేషన్ వేసిన అభ్యర్థి పేరు ఓటరు జాబితాలో విధిగా ఉండాలని, ప్రతిపాదితులు కూడా రాజాంకు చెందిన వారై ఉండాలని తెలిపారు. నామినేషన్ ఫారం నింపిన సమయంలో ఎటు వంటి తప్పులు లేకుండా నింపాలని, తప్పులు ఉంటే తిరస్కరి స్తామని చెప్పారు. తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్, సంతకవిటి, వంగర, రేగిడి మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోషఫ్

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య

డెంకాడ, ఏప్రిల్ 2: కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పినతాడివాడ గ్రామానికి చెందిన రెడ్డి రాజేష్(27) డిగ్రీ పూర్తిచేసి గ్రామంలో ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఏదైనా ఉద్యోగ ప్రయత్నం చేస్తూ ఇంటివద్ద వ్యవసాయం చేసుకోవచ్చు కదా అని తండ్రి సత్యనారాయణ మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన రాజేష్ సోమవారం తన కల్లం వద్ద కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

బొండపల్లి: మండలలోని గరుడబిల్లి గ్రామానికి సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే స్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, ముదురునీలిరంగు లుంగీ, నీలం ఆకుపచ్చ టీషర్టు ధరించి ఉన్నాడని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయనగరం రైల్వే ఎస్ఐ రవివర్మకుగానీ, బొబ్బిలి రైల్వే పోలీసులకుగానీ తెలపాలని, లేదా 94906 17089, 94918 13163 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

చింతచెట్టుపై నుంచి పడి వృద్ధుడి మృతి

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 2: మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన తైనాన దేముడు(74) చింతచెట్టుపై నుంచి జారిపడి మరణించాడు. ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేముడు గ్రామంలో స్థానికంగా ఉన్న చింతచెట్టుపై చింతకాయలు దులిపేందుకు ఉదయం 9గంటలకు చెట్టు ఎక్కాడు. అయితే పదిన్నర సమయంలో చెట్టుపైనుంచి జారిపడ్డాడు. వెంటనే స్థానికులు ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఇక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో విజయనగరం రిఫర్‌చేశారు. అక్కడకు కుటుంబసభ్యులు తీసుకెళ్లేసరికి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేశారు.

ముక్కాంలో విషాదఛాయలు

భోగాపురం: మండలం సముద్ర తీర ప్రాంతమైన ముక్కాంలో మంగళవారం విషాదచాయలు అలుముకున్నాయి. ముక్కాం గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారులు విశాఖకు వలసవెళ్లి అక్కడే నివాసముంటూ స్థిరపడ్డారు. వారిలో కొంతమంది మత్స్యకారులు కారిచిన్నారు, వాపల్లిఅప్పన్న, కారిసురేంద్ర, కారి సత్తయ్య, వాసపల్లిఅప్పన్న, మరొకరు విశాఖ సముద్ర తీరం నుంచి సోమవారం మధ్యాహ్నం సుమారు 3గంటలకు పడవపై వేటకెళ్లారు. అయితే వేటకెళ్లినవారు మంగళవారం ఉదయానికి లేదా మధ్యాహ్నానికి తీరానికి చేరుకోవాల్సి ఉండగా ఇంకా రాకపోవడంతో సముద్రంలో గల్లంతైనట్లు కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. దీంతో ముక్కాంలో ఉన్న వారి బంధువులంతా తీవ్ర ఆందోళన గురవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇల్లు దగ్ధం

భోగాపురం: మండలం చేపలకంచేరు గ్రామంలో మైలపల్లి దానయ్యమ్మకు చెందిన పూరిల్లు ప్రమాదవ శాత్తు మంగళవారం దగ్ధమైంది. అయితే చుట్టుపక్కల వారు స్పందించి మంటలు అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఇంట్లో రూ.3లక్షల నగదుతో పాటు వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయంటూ బాధితురాలు విలపిస్తోంది.

డంపింగ్ యార్డులో మంటలు

రాజాం: మండలంలోని గారాజు చీపురుపల్లి సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థాలకు మంగళవారం నిప్పుపెట్టారు. దీంతో మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగలు చుట్టుపక్కల వ్యాపించాయి. విషయం తెలుసుకున్న వెంటనే పురపాలక సంఘం కమిషనర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వాటర్ ట్యాంకులతో నీటిని తీసుకువెళ్లి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు, దట్టమైన పొగను అదుపు చేశారు. డంపింగ్ యార్డులో మంటలు పెట్టే వారిపై నిఘా ఏర్పాటు చేస్తామని, ఆచూకీ తెలిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్, సూపరువైజర్లు మరడాన అప్పలనాయుడు నెమలపురి జయరాం పాల్గొన్నారు.

పశువులు మృతి

జామి: మండలంలోని ఎంకెవలస గ్రామంలో చింతపల్లి కృష్ణకు చెందిన మూడు పశువులు మంగళవారం ఉదయం ఆరుగంటల సమయంలో మృతిచెందాయి. ఈసంఘటనకు సంబంధించి స్థానికులు పశుసంవర్ధకశాఖ ఏడీ రెడ్డి కృష్ణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చింతపల్లి కృష్ణ ఉదయం ఆరుగంటల సమయంలో తన ఒక గెదె, ఒక ఆవుపడ్డ, ఒక గెదెపడ్డలకు ఒకేసారి దాణా వేశాడు. ఆ వెంటనే ఒకేసారి మూడు పశువులు మృతిచెందాయి. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి నాయుడు, జిల్లా పశువైద్యాధికారులను రప్పించి ఘటనా స్థలంలో పోస్టుమార్టం చేయించారు. వీటి మరణాలకు గల కారణం నివేదిక వచ్చాక తెలుస్తుందని వైద్యులు తెలిపారు. ఈ ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సింగరాయిలో అగ్ని ప్రమాదం

వేపాడ: మండలంలోని సింగరాయి గ్రామ సమీపంలో గల ఏఎన్నార్ లేఅవుట్‌లో సోమవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో చెందనం, మల్బరీ మొక్కలు కాలిపోయాయి. ఎస్.కోట అగ్నిమాపక అధికారి మదీన తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి, అగ్నిమాపక అధికారి మదీన ఘటనా స్థలానికి చేరుకుని నష్ట వివరాలను సేకరించారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

పోలీసు శాఖకు స్టాపర్ల వితరణ

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంకు అధికారులు పోలీసు శాఖకు ఏడు స్టాపర్లను అందించారు. విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావుకు ఆయన కార్యాలయంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ గోవిందరావు మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో స్టాపర్లు ఎంతో ఉపయోగడతాయన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ ఎ.శ్రీనివాసరావు, డీజీ పట్నాయక్, విశ్వనాథ్, సీఐలు రామారావు, శ్రీనివాసరావు, ఎస్ఐలు లోవరాజు, వాసుదేవరావు, ఏఎం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



స్టాపర్లతో పోలీసులు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● డిప్యూటీ డీఈవో కృష్ణమూర్తి

పాలకొండ: విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, తల్లిదం డ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలి డిప్యూటీ డీఈవో పల్రి కృష్ణమూర్తి ఆకాంక్షించారు. మంగళవారం పట్టణంలోని వెంకమ్మపేట ఎంపియూపీ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో-2 సోంబాబు మాట్లాడుతూ పాఠశాలకు మంచి పేరు రావాలంటే ఉత్తమ విద్యాబోధన అవసరమని తెలిపారు. అనంతరం డిప్యూటీ డీఈవో, ఎంఈవోలను హెచ్ఎం జి.పరాంకుశంనాయుడు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మల్లేశ్వరరావు, గోపి, ఉదయ్, గౌతమి, రమాకుమారి, నాగమణి, ఎంఆర్సీ సిబ్బంది లక్ష్మణ, భాను పాల్గొన్నారు. అలాగే ఓని ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం బలగ నాగమణి అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి, ఎంఈవో-2 కె.సోంబాబు పాల్గొనగా, పాఠశాలలో పనిచేస్తున్న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గోగుల సూర్యనారాయణ పదోన్నతిపై వెళ్లడంతో సన్మానించారు.

కైలాసనాథస్వామి యాత్రకు ఏర్పాట్లు



యాత్రా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో గురువారంనుంచి ఐదురోజుల పాటు జరిగే కైలాసనాథస్వామి యాత్రకు అధికారులు, నిర్వాహకులు ఏర్పా ట్లుచేస్తున్నారు.ఈ మేరకు యాత్రా స్థలాన్ని ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ మంగళ వారం పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు పరిశీలించాలని తెలిపారు. జెయింట్‌వీల్స్, డ్రాగన్ ట్రైన్, బ్రేక్ డ్యాన్స్, బైక్ రైడింగ్, కార్ రేసింగ్ వాటిపై ప్రత్యేక దృష్టిసారించాని చెప్పారు.ఆయన వెంట ఎస్ఐ శివ ప్రసాద్,సర్పంచ్ గౌరీశంకరరావు, వైస్ఎంపీపీ శేఖర్, ఆలయకమిటీ సభ్యులు ఉన్నారు.

1,800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

వీరఘట్టం: చినగోర శివారులో సారా తయారు చేయడానికి 12 ప్లాస్టిక్ డ్రమ్ములతో సిద్ధంగా ఉంచిన 1800 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి మంగళవారం పోలీసులు ధ్వంసం చేశారు. సారా తయారీ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎస్కే ఫక్రుద్దీన్ హెచ్చరించారు.



వీరఘట్టం: బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సారా స్వాధీనం

సీతంపేట: సీతంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గల మండ గ్రామ సమీపంలో జీడితోట వద్ద సారా తరలిస్తున్నారని సమాచారం మేరకు మంగళవారం సిబ్బందితో దాడిచేసినట్లు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు 200 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదుచేసినట్లు చెప్పారు. తప్పించుకున్న వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



గరుగుబిల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: సార్వత్రికఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని ఎస్ఐ వై.అమ్మన్నరావు సూచించారు. గరుగుబిల్లి, పెద్దూరు గ్రామాల్లో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు.మండలంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన



కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కురుపాం: విద్యుత్ ఆదా చేద్దాం.. భవితరాలకు భరోసా ఇద్దామని కురుపాంలో జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని వెంకటరాయునికోనేరులో గల్లంతైన మేదరవీధికి చెందిన మిండి ప్రభాష్ మృతదేహం లభ్యమయ్యింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నగర పంచాయతీ పరిధిలోని వెంకటరాయునికోనేరులో సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు మిండి ప్రభాష్ స్నానానికి దిగాడు. సోమవారం రాత్రి వరకు జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. రాత్రి తొమ్మిది గంటల వరకు గాలించి ఆపై నిలిపివేశారు. మంగళవారం మూడు గంటల ప్రాంతంలో ప్రభాష్ మృతదేహం నీటిలో తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో పాలకొండ అగ్నిమాపక సిబ్బంది కె.దుర్గారావు, ఎం.రవికుమార్ ఒడ్డుకు చేర్చి పోలీసులకు, ప్రభాష్ కుటుంబాలకు అప్పగించారు.ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జంతువుల సంరక్షణపై దృష్టి సారించాలి

మక్కువ: వేసవి తీవ్రత దృష్ట్యా జంతువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పశు వైద్యాధికారి కె.పోలందొర అన్నారు. మక్కువలో మంగళవారం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను షెడ్‌లో ఉంచి, తాగునీటి సౌకర్యం మరింతగా పెంచాలన్నారు. పశువులకు ఆకుపచ్చ గడ్డితో పాటు ప్రోటీన్ కొవ్వుతో కూడిన బైపాస్ సప్లిమెంట్ అందివ్వాలన్నారు. ఉప్పునీరు అందించాలన్నారు. సాయంత్రం సమయంలో మాత్రమే పశువులను మేతకు తీసుకెళ్లాలని సూచించారు. జంతువుల ఆరోగ్యంపై ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయండి

కొమరాడ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐసీపీవో ఎంఏ నాయుడు అన్నారు. కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు చిన్నారుల వివాహాలను అడ్డుకొని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అనాథ పిల్లలను చిల్డ్రన్ హోమ్‌కు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని జి.సుగుణకుమారి, తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పార్వతీపురంటౌన్: పట్టణంలోని శ్రీవిద్యా సర్వమంగళాదేవి పీఠం ప్రాంగణంలో బుధవారం నిర్వహించనున్న ప్రతిష్ఠా మహోత్సవాలకు పీఠం వ్యవస్థాపకుడు ముర పాక కాళిదాసు శర్మ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం వైభవ వేంకటేశ్వర స్వామి విగ్రహానికి క్షీరాధివాసం, ధాన్యాధివాసం నిర్వహించారు. బుధవారం ఉదయం వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహో త్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి.

వివాదాలకు దూరంగా ఉండండి

● ఎన్నికల నియమావళిపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన
● గ్రామాల్లో కవాతు



రేగిడి: మాట్లాడుతున్న చీపురుపల్లి ట్రైనీ డీఎస్పీ మహేంద్ర



డెంకాడ: కవాతు చేస్తున్న పోలీసులు



రాజాం రూరల్: కవాతు నిర్వహిస్తున్న పారా మిలటరీ దళాలు

రేగిడి: ఎన్నికల్లో వివాదాలకు దూరంగా ఉండాలని, ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని చీపురుపల్లి ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు కోరారు. మండలంలో కొండవలసలో ఎన్నికల చైతన్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నియమావళి, సి-విజల్ యాప్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో రేగిడి ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు కోరారు. మండలంలోని దోసరి, ఆగూరు, కంచరాం, గడిము డిదాంలో మంగళవారం పారా మిలటరీ దళాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పెద్దలు, యువతతో మాట్లాడారు. గ్రామాల్లో అశాంతి వాతావరణం కలగజేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ● **డెంకాడ:** మండలంలో ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు గుణుపూరు, పెదతాడివాడ, పినతాడివాడ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ పింఛన్లు అందించాలి

రాజాం రూరల్: పింఛన్‌దారులకు ఇళ్ల వద్దే పింఛన్లు అందజేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈమేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వంగా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం:** సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ నాయకులు ఇన్‌చార్జి కమిషనర్ ఎంవీ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. నంది సూర్యప్రకాష్‌రావు తదితరులున్నారు. ● **తెర్లాం:** పింఛన్లు ఇంటి వద్దనే అందించేలా చూడాలని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు ఎంపీడీవో మధుసూదనరావుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. నర్సుపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ● **విజయనగరం రూరల్:** ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్లను అందజేయాలని కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు మంగళవారం ఎంపీడీవో గంటా వెంకటరావుకు వినతిపత్రం అందించారు. పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ రాజకీయం చేయాలని చూస్తోందని, దీనిని టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ● **బాడంగి:** ఇంటింటికి వెళ్లి వృద్ధులకు, వితంతువులకు పింఛను ఇవ్వాలని కోరుతూ విజయనగరం జిల్లా టీడీపీ బీసీ సాధికారిక కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆంజనేయులకు వినతిపత్రం అందజేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** పెన్షన్ డబ్బులను వారి ఇళ్లవద్దనే సచివాలయం సిబ్బంది ద్వారా అందజేయాలని కోరుతూ టీడీపీ సర్పంచ్‌లు, నాయకులు పార్టీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ నాయకత్వంలో ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గున్నతోటవలస, రంగరాయపురం సర్పంచ్‌లు పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట:** సామాజిక పింఛన్లు ఇంటింటికి వెళ్లి అందజేయాలని కోరుతూ ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి మంగళవారం ఎంపీడీవో కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. చొక్కాకుల మల్లునాయుడు, కరెడ్ల ఈశ్వరరావు, తదితరులు ఉన్నారు. ● **జామి:** ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలని స్థానిక టీడీపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ఏవో నరసింహంకు వినతిపత్రం ఇచ్చారు. పెదబాబు, కొత్తలి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** పింఛన్లు ఇళ్ల వద్దే అందించాలని టీడీపీ మండల నాయకులు స్థానిక ఎంపీడీవో సాంబశివరావును కోరారు. ఈమేరకు పార్టీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. రెడ్డి వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట (కొత్తవలస):** సామాజిక పింఛన్ల పంపిణీ విషయంలో ముఖ్యమంత్రితో సహా వైసీపీ నేతలు ప్రజలకు వాస్తవాలు చెప్పాలని రాష్ట్ర అయ్యరక సంఘ కన్వీనర్ బంగారు రమేష్ మండిపడ్డారు. ఈ మేరకు కూటమి నేతలతో కలిసి మంగళవారం ఎంపీడీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కనకల శివ, కోళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. ● **గజపతినగరం:** ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మనాయుడు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో పింఛన్ పంపిణీపై జగన్ చేస్తున్న అరాచకాలను పింఛన్‌దారులకు వివరించాలన్నారు. మత్తిరెడ్డి వెంకటరమణ, మజ్జి గోవింద తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన నాగార్జున

చీపురుపల్లి: 'మీ రాజకీయ భవిష్యత్తుకు నేను భరోసా ఇస్తున్నాను. పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి మీరిచ్చిన రాజీనామాను ఉపసంహరించుకోండి.' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. కిమిడి నాగార్జునకు హామీ ఇచ్చారు. చీపురుపల్లి అసెంబ్లీ స్థానానికి టికెట్ ఆశించి, భంగపడిన నాగార్జున మంగళవారం విజయవాడలో లోకేశ్‌ను కలిశారు. ఆయనతో పాటు వచ్చిన నాలుగు మండలాల టీడీపీ నాయకులు.. పార్టీ కోసం నాగార్జున పడిన శ్రమను లోకేశ్‌కు వివరించారు. దీనికి లోకేశ్ స్పందిస్తూ.. 'ఈ ఎన్నికల్లో కూడా పార్టీ తరపున జిల్లాలో ప్రచార బాధ్యతలను మీకే అప్పగిస్తున్నాను. చీపురుపల్లి టికెట్‌ను ఆఖరి నిమిషం వరకూ మీకే ఇద్దామని పార్టీ భావించింది. అయితే చివరి నిమిషంలో అనివార్య కారణాల వల్ల అభ్యర్థిని మార్పు చేయాల్సి వచ్చింది' అని అన్నారు. దీనికి నాగార్జున తనకు నాలుగు రోజుల గడువు కావాలని, ఆ తర్వాత తన నిర్ణయాన్ని తెలియజేస్తానని చెప్పారు.



నాగార్జునను ఆలింగనం చేసుకుంటున్న లోకేశ్

అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం

బొండపల్లి: వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలను కాపాడేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సాయమే కీలకమని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గరుడబిల్లి జంక్షన్ సమీపాన ఒక ఫంక్షన్ హాలులో కార్యకర్తలతో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీపై సమావేశం నిర్వహించారు. మండల మహిళా అధ్యక్షురాలు ముంజేటి పార్వతి, సీనియర్ నాయకులు బుచ్చిరాజు, శనపతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

దత్తిరాజేరు: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థి కె.శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం గొబ్యాంలో క్లస్టర్ స్థాయి సమావేశం నిర్వహించారు. అంతకు ముందు స్థానికంగా పర్యటించారు. ఆయన వెంట జనసేన ఇన్‌చార్జి మర్రాపు సురేష్ ఉన్నారు. గొబ్యాంలో 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఎంపీటీసీ వంగపండు కృష్ణమూర్తినాయుడు, మాజీ సర్పంచ్ వంగపండు ఆలివేణి ఆధ్వర్యంలో వీరంతా చేరారు. వీరికి శ్రీనివాస్, సురేష్ పార్టీలోకి ఆహ్వానించారు.

కళాకారులకు మినహాయించండి

జియ్యమ్మవలస: కళారూపాల ప్రదర్శనకు ఎన్నికల అధికారులు, పోలీసులు మినహాయింపు ఇవ్వాలని అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్వారపురెడ్డి ధనుంజయరావు కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర డీజీపీకి, అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి పేరుతో తమను ఇబ్బందికి గురిచేయొద్దని, మినహాయింపు ఇవ్వాలని కోరారు.

ఘనంగా కోటమ్మతల్లి జాతర

బొండపల్లి: గొల్లుపాలెం గ్రామంలో వెలసిన కోటమ్మ తల్లి జాతర మహోత్సాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు ఆలయం వద్ద బారులుతీరారు. కోలాటం, మంగళవాయిద్యాల నడుమ ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఏర్పాటు చేసిన జానపద సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

వైసీపీకి ఓటమి తప్పదు

డెంకాడ: గుణుపూరుపేటలో కూటమి అభ్యర్థి లోకం మాధవి మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీకి ఓటమి తప్పదన్నారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు ఉన్నారు. మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాణిరాజు, చిరంజీవిరాజు, జనసేన నాయకులు చింతపల్లి రామ్మూర్తి, తుమ్మి లక్ష్మీరాజ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మాధవి

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

బొండపల్లి: ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఒంపల్లిలోని సచివాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులను సంబంధిత ఆసు పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకునేలా చూడాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలతో పాటు హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాల సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, సీహెచ్‌వో రాజగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ బాషా, హెల్త్ ఎడ్యుకేటర్ బి.విశ్వేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

క్లుప్తంగా..

పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ

గంట్యాడ: మదనాపురం ఆదర్శ పాఠశాలకు మన గ్రోమోర్ కంపెనీ వాటర్‌ప్లాంట్‌ను సమకూర్చింది. ఈ వాటర్‌ప్లాంట్‌ను మన గ్రోమోర్ జోనల్ మేనేజరు కిషోర్ వర్మ మంగళవారం ప్రారంభించారు. జోనల్ మార్కెటింగ్ మేనేజరు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నేడు టీడీపీలోకి మక్కువ శ్రీధర్

గజపతినగరం: లోగిస గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్ బుధవారం ఎన్డీఏ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు సమక్షంలో పార్టీలో చేరనున్నారు. ఆయన వెంట పలు గ్రామాలకు చెందిన మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు టీడీపీ కండువాలు కప్పుకోనున్నారు.

'కళా'ను కలిసిన జనసేన నాయకులు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, డి.రమేష్‌రాజు, రేగిడి లక్ష్మణరావు, రామచంద్రరావు, శంకర్, నరసింహ, కృష్ణమూర్తి, సింహాచలం, రమణ, ఆదినారాయణ, బీఏ నాయుడు ఉన్నారు.

21 మందికి నేత్ర పరీక్షలు

చీపురుపల్లి: మానవీయత సంస్థ కార్యాలయంలో మంగళ వారం జరిగిన నేత్ర వైద్య శిబిరంలో 21 మందికి పరీక్షలు చేశారు. గరివిడి కంటి ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరా న్ని ఏర్పాటు చేశారు. 9 మందికి శస్త్ర చికిత్సలు అవసర మని గుర్తించారు. ఈ కార్యక్రమంలో మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు, గరివిడి కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ప్రథమ స్థానం

నెల్లిమర్ల: సమష్టి కృషితోనే ఆస్తి పన్ను వసూలులో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పన్ను వసూలులో కీలకంగా పనిచేసిన గాంధీనగర్ కాలనీ, మొయిద జంక్షన్ వార్డు సచివాలయాల పరిపాలన కార్యదర్శులు కల్యాణపు నాగరాజు, దుప్పాడ ప్రదీప్ కుమార్‌ను కమిషనర్‌తో పాటు మేనేజర్ విశ్వేశ్వరరావులు సత్కరించారు. కమిషనర్, మేనేజర్లను, ఆర్ఐ రాజ్యలక్ష్మిని, గుమస్తా తులసిని సిబ్బంది సత్కరించారు.

యూపీ రాజును ఇన్‌చార్జిగా నియమించాలి

రాజాం: రాజాం నియోజకవర్గంలో జనసేనను బలోపేతం చేసిన తనను ఇన్‌చార్జిగా నియమించాలని యూపీ రాజు, ఆ పార్టీ రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల జనసేన నాయకులు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో యూపీ రాజుతోపాటు గొర్లె గోవిందరావు, రెడ్డి బాలకృష్ణ, శ్రీనివాస్, కృష్ణ, నాగరాజు, శ్యామ్, అప్పలనాయుడు విలేకరులతో మాట్లాడారు. ఎన్ని రాజు పార్టీ బలోపేతానికి ఎటువంటి కృషి చేయలేదని,పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌కు మద్దతుగా ఉండడంలేదని తెలిపారు. పొత్తు ధర్మం పాటించకుండా జనసేన రెబల్‌గా పోటీ చేస్తుండడం, పవన్ కల్యాణ్ స్థాయిని, జనసేన పార్టీని విమర్శించడంతో ఎన్ని రాజుకు తక్షణమే తొలగించే చర్యలు పార్టీ అధిష్ఠానం తీసుకోవాలని కోరారు. పార్టీ కోసం పదేళ్ల నుంచి కృషి చేస్తున్న ఉర్లాపు రాజుకు ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టాలని తెలిపారు.

వైభవంగా పాలధార మహోత్సవం

శృంగవరపుకోట రూరల్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కొట్టాం కోటమ్మతల్లి పాలధార మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్ద సేనాపతి కోటరావునాయుడు, ఈవో నాగేంద్ర, సర్పంచ్ బాలసన్యాసమ్మ, సేనాపతి చంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి గద్దె గుడిలో పూజలు చేశారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమణబాబు ఆధ్వర్యంలో పూజారులను గ్రామంలో ఊరేగించారు. ఇదే సమయంలో వందలాది మంది యువత పెద్ద ఎత్తున కర్రలతో గాలిలో కొడుతూ గ్రామంలో పరుగులు పెట్టారు. ఇలా చేయడం వల్ల గ్రామంలో చీడపీడలు తొలగుతాయని నమ్మకం. అమ్మవారి ప్రతిరూపంగా భావించే పసుపు ముద్దను తయారు చేసి గ్రామం అంతా తిప్పారు.



కర్రలతో గాలిలో కొడుతున్న యువత

పింఛన్లపై దుష్ప్రచారం తగదు

బొబ్బిలి: వలంటీర్ల జోక్యాన్ని ఎన్నికల సంఘం నిలువరించిందని, దీనిపై వైసీపీ నాయకులు చంద్రబాబుకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ నేత బేబీనాయన ఆరోపించారు. మంగళవారం బొబ్బిలి కోటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేక పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. తమ సొంత కాంట్రాక్టర్లందరికీ రూ.13 వేల కోట్ల బిల్లులను చెల్లించారని అన్నారు. వలంటీర్ల వ్యవహారాన్ని వైసీపీ రాజకీయ లబ్ధి కోసం వినియోగించుకుంటోందని తెలిపారు. తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.నాలుగు వేల చొప్పున పింఛను అందిస్తామని తెలిపారు. ఈ నెల 5 లోగా లబ్ధిదారులందరికీ పింఛన్లను పూర్తి స్థాయిలో పంపిణీ పూర్తి చేయని పక్షంలో ప్రభుత్వం వారి ఆగ్రహానికి గురికాక తప్పదని బేబీనాయన అన్నారు.

పంపిణీ ఆలస్యమైతే ఆందోళన

బొబ్బిలి: సామాజిక పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తే ఆందోళనకు దిగుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీలో వలంటీర్ల జోక్యాన్ని నివారించేందుకు ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుందన్నారు. దీనిపై ప్రభుత్వం చంద్రబాబు, నిమ్మగడ్డ ప్రసాద్, ఇతర ప్రతిపక్షాలే కారణమని చెప్పుకొని తిరుగుతుండడం సిగ్గుచేటని అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, మండల కార్యదర్శి తాడంగి ఎండుదొర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



ప్రచారం చేస్తున్న కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: రాష్ట్రంలో అధికార మార్పిడి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఎస్.కోట టీడీపీ-జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి కోళ్ల లలిత కుమారి తెలిపారు. చంద్రబాబును అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మంగళవారం ఆమె కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి లింగంపేట, సంతపేట, మార్లాపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, మల్లా రామకృష్ణ, వీరమహిళ ఇర్ర వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.